# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాల హారిచందనాలు

రమ శేషాద్రి



సృష్టిలో తీయనైనది "అమ్మ" అనే పిలుపు. "అమ్మా" అని పిలిపించుకోవడం ఎంత మధురమో, 'అమ్మా' అని పిలవడము అంతే మధురం, అదృష్టమూను.

ప్రేమ, శాంతం, సహనం, త్యాగం - వీటికి మరో రూపమే అమ్మ.

ప్రతి వ్యక్తి తమ తల్లిని గురించి చెప్పేదే ఇది. నా అభిప్రాయం కూడా ఇదే కాకపోతే ఒకొక్క మాతృమూర్తి ఒక్కొక్క పరిస్థితిలో, ఒక్కొక్క విధంగా ఆ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన రీతిలో రూపాంతరం చెందుతుంది.

ఈ సందర్భంలో నేను మా అమ్మగారిని గురించిన కొన్ని విశేషాలను 'కౌముది' ద్వారా మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మా అమ్మగారి పేరు శ్రీదేవి. స్వాతంత్ర్య సమరయోధులు, కాంగ్రెస్ మహాసభలకు ఆంధ్రదేశం నుంచి లక్నో వరకు పాదయాత్ర సాగించిన ధీరుడైన శ్రీ సూరంపూడి శ్రీహరిరావుగారు, సూరంపూడి రమణమ్మ గార్ల రెండవ కుమార్తె ఈవిడ. 1937 వ సంవత్సరంలో కాకినాడలో జన్మించారు.

బాల్యం - సుమారు పన్నెండు సంవత్సరాలవరకు ఆవిడ తన జీవితాన్ని కాకినాడ, రాజమండ్రి, రామచంద్రాపురం, మండపేటలలో గడిపారు. ఈ పన్నెండు సంవత్సరములు స్నేహితురాళ్ళతో తొక్కుడు బిళ్ళలు ఆడుకోవటం, పొలాలమ్మట, గట్లమ్మట తిరగడం, జామకాయలు, రేగుపళ్ళు కోసుకుని తినడం, ఇష్టం ఉంటే బడికి వెళ్ళడం లేకపోతే లేదు. ఇది ఆవిడ దినచర్య. తండ్రి స్వాతంత్రోద్యమంలో ఊరూరు తిరుగుతూ ఉండేవారు. దానితో ఆవిడకి సరియైన చదువు, క్రమశిక్షణ లేకుండా పోయింది. పదమూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన మా అమ్మగారిని, పిన్నిని తీసుకుని మా అమ్మమ్మగారు, తాతగారు హైదరాబాద్ వెళ్ళడం జరిగింది.

స్నేహితుల ఇంట్లో దిగారు కొన్ని రోజుల పాటు ఉండడానికి. అక్కడ కూడా చెల్లెళ్ళి, మరికొందరు స్నేహితులని పోగేసుకుని ఆవిడ యధాప్రకారం హాయిగా, చీకూ చింత లేకుండా ఆడుకుంటూ ఉండేది.

అలాగే ఒక రోజు సాయంత్రం గోటీ బిళ్ళలు ఆడుకుంటూ ఉండగా వాళ్ళ అమ్మగారు వాకిట్లోకి వచ్చి, 'ఇంటికి చుట్టాలు వచ్చారు. లోపలికి రా!' అని తీసుకుని వెళ్ళి మొహం కాళ్ళు, చేతులు కడిగించి గబగబా ముస్తాబు చేయించి కూర్చోబెట్టారట. కారణం ఏమిటో కూడా ఆలోచించలేని వయసు, అమాయకత్వం. మర్నాటికి ఆవిడకి తెలిసిన విషయం - వచ్చేవారం ఈ పాటికి తనకి పెళ్ళి అయిపోతుంది. జీవితం అంటే హాయిగా ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ గడపడమే అనుకునే అమాయకపు దశలోనే మూడు ముళ్ళు పడిపోయాయి. పదిమంది ఉన్న ఉమ్మడి కుటుంబంలోకి కోడలుగా వెళ్ళింది. షరా మామూలే.. తెల్లవారి లేవడం, పనిపాటలు చేసుకోవడం, వండి వార్చడం. తరువాత రెండు సంవత్సరాలకి ఒకరు చొప్పున ఐదుగురు సంతానం. నేనే ఆఖరి సంతానం. నేను పుట్టేసరికి మా అమ్మగారి వయస్సు 23 సంవత్సరాలు.

కుటుంబం పెరిగే సరికి ఆర్థిక ఇబ్బందులు. అసలే పురుషాధిఖ్య సమాజం. దానికి తోడు కోపధారి భర్త. పర్యవసానం భార్య వీపు విమానం మోత మోగిపోవడం, ఏడుపులు, పెడబొబ్బలు. ఇది ఆనాటి ఆవిడ పరిస్థితి. ప్రతి నిమిషం ఆత్మాభిమానం చంపుకుని జీవించడం, జీవించవద్దు అనుకోవడానికి లేకుండా ఐదుగురు పసిపిల్లల బాధ్యత. అప్పటికే ఆవిడ తండ్రిగారు - అంటే మా తాతగారు కాలం చేశారు. అన్నదమ్ములు లేరు.. ముగ్గురు ఆడపిల్లలే. దిక్కుతోచని స్థితి. అప్పుడే ఆవిడలో ఆలోచించటం అన్నది మొదలైంది. అసలు ఇలాంటి స్థితికి కారణం ఎవరు. తనే! తనకి సరైన విద్యాభ్యాసం, ఆర్థిక స్వాతంత్ర్యం ఇవన్నీ లేకపోబట్టే కదా ఈ పరిస్థితులు ఎదురవడం, తను చదువుకుంటే, ఉద్యోగం చేస్తే తన పిల్లలకి చదువు చెప్పుకోగలుతుంది, ఆర్థిక పరిస్థితి మెరుగు పడతాయి. తన భర్త నుంచి గౌరవ మర్యాదలు లభిస్తాయి. కనక తను చదువుకోవాలి అనే బీజం మొలకెత్తింది ఆవిడ మనసులో.

ఈ అభిప్రాయాలని స్నేహితురాలు సీతమ్మగారితో పంచుకుంది. అన్నీ విన్న ఆవిడ 'అవును మనం మాత్రం ఎందుకు చదువుకోకూడదు, కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదు, మనసుంటే మార్గం అదే ఏర్పడుతుంది. కృషి చేస్తే దైవానుగ్రహం. తప్పకుండా ఉంటుంది. మనం మన భర్తల నడిగి చదువు మొదలు పెడదాం' అన్నారు. మా అమ్మగారి మనసులో మొలకెత్తిన బీజానికి ఆవిడ మాటలు  తొలకరి జల్లులే అయాయి.

ఆ విషయమే మా నాన్నగారితో సంప్రదించగా - 'అయ్యో ఐదుగురు పిల్లలతో నాకే భారంగా ఉంటే ఇప్పుడూ నీకు చదువా? నువ్వేమైనా ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళు ఏలాలా?' అన్నారుట. దానికి ఆవిడ 'మీరు ఒప్పుకుంటే చాలు. డబ్బు ఏర్పాటుకి నేను మా అమ్మని, అక్కని అడిగి సహాయం తీసుకుంటాను. మిమ్మల్ని విసిగించను' అన్నారట. దానికి ఆయన 'సరే' అన్నారు. మనసులో గట్టి నమ్మకం. ఇది నిజంగా చదవాలా, ఉద్ధరించాలా అని.

అప్పటికి ఇంకా కరెంటు లేదు. కిరోసిన్  దీపాలు పెట్టుకుని పిల్లలందరూ చదువుకునే పరిస్థితులు. ఇంటికి దగ్గరలోనే ఉన్న ఒక ట్యుటోరియల్ కాలేజీలో, సాయంత్రపు కళాశాలలో ఆంధ్రామెట్రిక్‌లో చేరి, వాళ్ళని, వీళ్ళని అడిగి పుస్తకాలు తెచ్చుకుని, క్లాసుకి వెళ్ళి వచ్చి, రాత్రి అందరి భోజనాలు, పిల్లల చదువులు అయ్యాక ఆ లాంతరు తను తీసుకుని అర్ధరాత్రి వరకు చదువుకుని, తిరిగి యధాప్రకారం తెల్లవారే లేచి తన దినచర్యలో ఎలాంటి లోపం లేకుండా, అతిధి మర్యాదలకి ఆటంకం లేకుండా, సంవత్సరమంతా కష్టపడి, పరిక్ష సెంటర్ గుంటూరులో ఇవ్వగా పదిహేను రోజులు ఆ క్రొత్త ఊరిలో ఉండి పరీక్షలు వ్రాసి, మొదటి ప్రయత్నంలోనే ఆంధ్రా మెట్రిక్ పాస్ అయ్యారు. ఆర్థిక సహాయంలోనే కాక, చదువు చెప్పడంలో కూడా మా అమ్మమ్మగారు మా అమ్మకి సహాయపడేవారు. ఆ రోజుల్లోనే మా అమ్మమ్మగారు "సూరంపూడి రమణమ్మగారు" ఇంగ్లీషు, గణితంలో దిట్ట.

ఒకసారి విద్య రుచి చూసిన వారికి విడవడానికి మనసురాదు. మా అమ్మగారి పరిస్థితి అదే వేడిలో ఉండగానే ఈ చదువు కొన సాగించాలనుకుని పి.యు.సి లో చేరి నిర్విరామంగా కృషి చేసి అలాగే మొదటిసారిలోనే పరీక్షల్లో ఉత్తీర్ణురాలయ్యారు. అది చూచి మా నాన్నగారిలో మార్పు వచ్చింది. ఆవిణ్ణి చూసి గర్వపడేవారు. ఆ తరువాత కష్టమో, నిష్ఠూరమో ఆవిడ చదువుకి ఆయనే తోడ్పడ్డారు.

'ఈ చదువుతో నాకు తప్పని సరిగా జాబ్ దొరుకుతుంది. నాకు ఎక్కడైనా ఉద్యోగానికి ప్రయత్నించండి' అని ఆయనకి చెప్పి, ట్యుటోరియల్ క్లాస్‌మేట్స్‌తో కలిసి వెళ్ళి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో పేరు రిజిష్టర్ చేయించుకుని వచ్చారు.

అనుకోకుండా ఒకరోజున - మే నెల, ఊరగాయల రోజులు, ప్రతి సంవత్సరంలాగే ఆ సంవత్సరం ఊరగాయల హడావిడిలో ఉన్న ఆవిడ పేరిట పోస్ట్ వచ్చింది, ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని.. విద్యుత్ సౌధ (ఎలక్ట్రిసిటీ బోర్డు)లో! ఆవిడ ఆనందానికి పట్టపగ్గాలు లేవు. మా నాన్నగారు దగ్గరుండి ఆవిడని ఇంటర్వ్యూకి తీసుకెళ్ళారు. ఆవిడకి అందులో ఉద్యోగం వచ్చింది. రాసిన రెండు పరీక్షలు మొదటిసారిలోనే పాస్ అవడం, మొట్టమొదటి ఇంటర్వ్యూ లోనే సెలెక్ట్ అయి ఉద్యోగం రావటం ఇవన్నీ దైవానుగ్రహమనే నమ్ముతారు మా అమ్మగారు ఈ నాటికీ కూడా.

ఉద్యోగంలో చేరి, ఆర్థిక ఇబ్బందుల్లో మా నాన్నగారికి చేదోడుగా ఉండి, మా అందరి చదువు సంధ్యలు చూసుకుంటూ ఇంట బయట ఆవిడ జీవనపోరాటం సాగిస్తూ వచ్చారు. ఇలా కొంత కాలం సాగగానే విధిలీలలు విచిత్రం అన్నట్టుగా హఠాత్తుగా ఆఫీసులో ఒక జీ.వో వచ్చింది. డిగ్రీ పట్టభద్రులైన వారికే ఈ ఉద్యోగం నిలుస్తుంది లేని వారిని తీసెయ్యమని. దిక్కు తోచని పరిస్థితి. అయినా సరే లేని ధైర్యాన్ని కూడ గట్టుకుని, కావలసిన ఇన్‌ఫర్మేషన్ సేకరించుకుని, కాలేజీలో చేరితే ఉద్యోగం చెయ్యడం కష్టమని, ప్రయివేటుగా ఉస్మానియా యూనివర్శిటీ నుంచి బి.ఏ. మూడు సంవత్సరాల పరీక్షలకి ఫీజు కట్టి మరొకసారి తన దీక్షని సాగించారు. మూడు సంవత్సరాల నిరంతర కృషి, మా చదువుల భారం పెరిగింది. ఈ నేపథ్యంలో మా పెద్దక్క వివాహం కూడా జరిగిపోయింది కాస్త చిన్న వయసులోనే. మా అమ్మగారి బి.ఏ. ఫైనల్ ఎగ్జామ్స్ నాటికి మా అక్కయ్యకి పురిటి రోజులు. అలాంటి పరిస్థితులలో ఆవిడ చదువుకునే వైనం చూసి అందరూ ముగ్ధులయ్యేవారు, చుట్టు పక్కల ఎవరి ఇంట్లోనైనా పిల్లలు చదువుకోకపోతే ఆవిడని చూసి బుద్ధి తెచ్చుకోండి. ఈ వయసులో ఐదుగురు పిల్లల బాధ్యతలతో ఆవిడ ఎలా చదువుకుంటోందో అని మందలించేవారు. మా అమ్మగారి దీక్షా, పట్టుదల, అచంచల విశ్వాసం వీటికి ముగ్ధులైన ఒక రిటైర్డ్ లాయర్ ఆ మూడు సంవత్సరాలు ప్రతి రోజూ వచ్చి చదువు చెప్పేవారు. ఆ వృద్ధ గురువు గురుదక్షిణ ఏమిటంటే శీతాకాలం, వర్షాకాలం అయితే ఒక కప్పు కాఫీ, వేసవికాలం అయితే ఒక గ్లాసు మజ్జిగ. అపూర్వమైన గురుశిష్యులు. ఆ నిర్విరామ, నిరాటంక కృషి ఫలితంగా 3 సంవత్సరాలలో బి.ఏ డిగ్రీని పొంది, తన ఉద్యోగం స్థిర పరుచుకుని ఆ తరువాత మరో ముప్ఫై సంవత్సరాలు అక్కడే ఉద్యోగం చేసి ఈ మధ్యలో డిపార్ట్ మెంట్ ఎగ్జామ్స్ కి చదివి పాస్ అయి చివరికి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా రిటైర్ అయ్యారు. హైదరాబాద్ లోని స్వగృహంలో ఉంటున్నారు. మధ్యలో మా నాన్నగారు పోయినప్పటికి ఆనాడు చేపట్టిన కుటుంబ భారం ఇప్పటి వరకు సక్రమంగా నిర్వహించి మా బంధువర్గంలో ఒక ఆదర్శ స్త్రీ మూర్తిగా పేరు తెచ్చుకుని ఆ తరువాత ఎందరో స్త్రీలకి ఆవిడ మార్గదర్శకం అయ్యారు.

ఆవిడలో ఉన్న దీక్ష, సహనం, ఆత్మవిశ్వాసం, నిద్రాహారాలని త్యాగం చేసి చదువుకోవడం ఇవన్నీ ఆవిడ విజయానికి ఒక్కొక్క దశలో ఒక్కొక్క మెట్టు. ఆవిడని మా అమ్మగా మీ అందరికి "కౌముది" ముఖంగా పరిచయం చేసే అవకాశం కలిగినందుకు నేనెంతో గర్విస్తున్నాను.

నా జీవితంలో నేను ఎన్నో సమస్యలని అధిగమించడానికి స్ఫూర్తిదాయకం మా అమ్మగారే.



రమశేషాద్రి గారు ఎం.ఎ. తెలుగు సాహిత్యంలో పట్టభద్రులు. 15 సంవత్సరాలు విశాఖపట్నం, హైదరాబాదులలో కాలేజీ లెక్చరర్‌గా పనిచేసి, గత 7 సంవత్సరాలుగా కెనడా, టొరాంటో సిటీలో వుంటున్నారు. మంచి రచనలు చదవడం తన హాబీ అంటున్న రమగారు 'కౌముది' కి రెగ్యులర్ పాఠకులు.